క్లుప్తంగా

యాప్ ద్వారా 'ఉపాధి' సమాచారం తెలుసుకోవచ్చు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న రాజారత్నం

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమాచారాన్ని మన ఫోన్‌లో జన్మనరేగా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని కోర్స్ డైరెక్టర్ దారా రాజారత్నం అన్నారు. కోడిపుంజుల వాగు గ్రామ సమీపంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలతో మంగళవారం ఆయన సమావేశమై జన్మనరేగా యాప్‌పై అవగాహన కల్పించారు. ఇందులో వేతనాలు ఎంత రావాల్సి ఉంది. ఏ ఖాతాకు జమయ్యాయి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ సౌకర్యాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పోరండ్ల రంగా, కార్యదర్శి కె.హన్నా, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయండి..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఈ నెల 25న భద్రాచలంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచి అత్యధికంగా తరలివెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంగళవారం సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. బల్లెం లక్ష్మణ్, సందా ప్రవీణ్, అబ్బూరి సునిల్, మేడిపల్లి బాబురావు, అంబడి కొండలరావు, పిల్లి బాబురావు, వేమూరి రాజు, గుండమళ్ల నాగేంద్ర, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

టేకులపల్లి: తెలుగుదేశం పార్టీ మండల నూతన కమిటీ ఎన్నికైంది. ఈ మేరకు మంగళవారం పార్టీ పరిశీలకుడు ఎండీ ఇమామ్, జిల్లా నేత ముద్రగడ వంశీల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుడిపూడి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గజ్జెల రామ్‌శేఖర్, ఉపాధ్యక్షుడిగా నలమాస శంకర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొలుకూరి రవిశంకర్, ఆంగోతు చందూలాల్, మసిపాక రామస్వామి, కార్యదర్శులుగా నెల్లూరి శ్రీను, జర్పుల గణేష్, జాటోతు శిరీషా, కోశాధికారిగా శివనాగుల రామారావు ఎన్నికయ్యారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సుజాతనగర్: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సుజాతనగర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీర్ల రమేష్, నర్రా శివ రామకృష్ణ, గండమాల భాస్కర్, చింతల శ్రీను, కొమరారెడ్డి, కాట్రాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సౌకర్యాల లేమి

- సమస్యలకు నిలయంగా ఆరోగ్య కేంద్రం భవనం
- నిధులు రావు.. సౌకర్యాలు లేవు
- అద్దె భవనంలో జగన్నాథపురం గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- రెండుసార్లు నిధులు మంజూరైనా నిర్మాణానికి గ్రహణం



పెద్దమ్మగుడి వద్ద గిరిజన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది, స్థానికులు

పాల్వంచరూరల్: జగన్నాథపురం పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కోసం వచ్చే రోగులను మౌలిక వసతుల సమస్య వేధిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం, పాలకులు చెబుతున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. నిధులు రాక, సౌకర్యాలు లేక రోజుకు 12 గంటలు మాత్రమే పనిచేసే గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు కనీస సౌకర్యాలు అందడం లేదు. మండలంలోని పెద్దమ్మతల్లి గుడి వద్ద 2004లో ఏర్పాటు చేసిన గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అరకొర వసతులు కలిగిన అద్దెభవనంలో కొనసాగుతోంది. ఆరు పడకల ఆస్పత్రికి నిత్యం 60 నుంచి 75 మంది రోగులు చికిత్స నిమిత్తం వచ్చిపోతుంటారు. ఆరు బెడ్లు, ఎనిమిది సబ్ సెంటర్లు, ములకలపల్లి, బూర్గంపాపాడు, పాల్వంచ మండలాల పరిధిలోని 58 గ్రామాల పరిధిలో వైద్యసేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో డాక్టర్ గది, హాల్, ఇన్‌పేషంట్ వార్డు ఉంది. వార్డులో కేవలం ఒక బెడ్ వేసేందుకు మాత్రమే వీలుంది. ఇదే గదిలో ఆస్పత్రి సామగ్రితో నిండి ఉండటంతో రోగులకు అసౌకర్యంగా ఉంది. మిగిలిన ఐదు బెడ్లు వేసేందుకు గదిలో సౌకర్యం లేక మూలన పడేశారు. రోగులకు, వైద్యసిబ్బందికి మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. దీంతో నిత్యం అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదు.

రెండుసార్లు నిధులు మంజూరు...

ఆస్పత్రి భవన నిర్మాణం కోసం 1998లో రూ.40 లక్షలు మంజూరు కాగా, స్థలం లేక భవనం నిర్మాణంలో జాప్యం జరగడంతో నిధులు వెనక్కు వెళ్లాయి. మళ్లీ 2003లో రూ.65లక్షలు మంజూరు కాగా, గుడికి సమీపంలో రెవెన్యూ అధికారులు చూపించిన స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేస్తుండగా సదరు భూమి మాదే అని స్థానికుడు కోర్టును ఆశ్రయించడంతో భవన నిర్మాణం ఆగిపోయింది. ఈ నిధులు కూడా వెనక్కు మళ్లాయి.

గ్రామంలో కొంతమంది కలిసి రూ.4లక్షల వ్యయంతో పదేళ్ల క్రితం హైస్కూల్ ఎదుట ఆస్పత్రి భవన నిర్మాణం కోసం స్థలం కొనుగోలు చేసి ఉంచారు. ఆస్పత్రి భవన నిర్మాణం చేస్తామని నవ భారత్ కంపెనీ యాజమాన్యం ఆరునెలల క్రితం ముందుకొచ్చింది. కానీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆస్పత్రి భవన నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

భవనం మంజూరు చేయాలి..



గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గుడి ఎదుట గల స్థలంలో నిర్మాణం చేసి రోగులకు సౌకర్యాలు కల్పించాలి. అమ్మవారి భక్తులకు, ఆస్పత్రి పరిధిలోని గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుతాయి.

– తారాచంద్, రంగాపురం

ఇబ్బందిగా ఉంది...



పెద్దమ్మగుడి వద్ద గల గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం రోగులకు, వైద్యసిబ్బందికి ఇబ్బందిగా మారింది. సమస్యను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ రాజు, జగన్నాథపురం పీహెచ్‌సీ

ప్రతిపాదనలు పంపాం..



జగన్నాథపురంలోని గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణం కోసం రూ.1.90 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణం చేపడతాం.

– డాక్టర్ భాస్కర్‌నాయక్, జిల్లా వైద్యాధికారి

కమిషనర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కనకమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సీఎంపీఎఫ్ రీజియన్ కమిషనర్ మట్టా కనకమ్మను తుడుం దెబ్బ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ... ఒక ఆదివాసీ బిడ్డ ఈ స్థాయికి రావటం అభినందనీయమన్నారు.

ఆదివాసీ యువత, మహిళలు కమిషనర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాయం లక్ష్మీనర్సు, పర్స నర్సింహారావు, కోరెం కృష్ణయ్య, తాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోల్ బంక్ నిర్మాణం

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో బంక్ నిర్మించనున్నారు. ఈ మేరకు అధికారులు మంగళవారం పెట్రోల్ బంక్ నిర్మించనున్న స్థలంలో అడ్డుగా ఉన్న ఆర్టీసీ గదులను జేసీబీతో కూల్చివేయించారు. గత నెలలో గదులు ఖాళీ చేయాలని షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణదారులకు నోటీస్‌లు జారీ చేయగా... గదులు ఖాళీ చేసి అప్పగించారు. అయితే బస్టాండ్ మూల మీద కొన్ని భవనాలు, గదులు ఉన్నాయని, వాటిని తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయమై ఆర్టీసీ డీఎం ఎం.దేవెందర్ గౌడ్‌ను వివరణ కోరగా.. ఆర్టీసీ గదుల వరకు తొలగించామని, మిగిలినవి ప్రైవేట్ వ్యక్తులకు చెందినవని చెప్పారు.

కార్మికుల బదిలీలు నిలిపి వేయండి..



మాట్లాడుతున్న రంగనాథ్

ఇల్లెందు: జేకే ఓసీలో కార్మికుల బదిలీలు నిలిపివేయాలని టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.రంగనాథ్, బ్రాంచి ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇల్లెందును కాపాడతామని, కార్మికుల బదిలీలు ఆపుతామని ప్రకటించిన నేతలు ప్రజాప్రతినిధులు కొంతకాలంగా వరుస బదిలీలు జరుగుతుంటే నోరు మెదపడం లేదన్నారు. పూసపల్లి ఓసీ నిర్మాణం చేపట్టాలని, అన్నిరకాల క్లియరెన్స్‌లు ఇప్పించాలని అధికార పార్టీ, దాని అనుబంధం కార్మిక సంఘాన్ని డిమాండ్ చేశారు.

ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకులపల్లి: గుర్తింపు పొందిన ఇన్సూరెన్స్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి ఎస్‌బీఐలో చెక్కు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జేత్రాం తండాకు చెందిన కేలోతు నరేష్ గత సంవత్సరం విద్యుత్ షాక్‌కు గురై చేయి కోల్పోవాల్సి వచ్చింది. ఇతను ఎస్‌బీఐలో రూ.1000 చెల్లించి జనరల్ ఇన్సూరెన్స్ తీసుకోవడంతో మంజూరైన రూ.10 లక్షల చెక్కును బ్రాంచి మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జె.మురళి, రమేష్, రాళ్లబండి కిరణ్ కుమార్‌రెడ్డి, పి.జంపయ్య, కృష్ణ, బిచ్చు తదితరులు పాల్గొన్నారు.

మ్యాచింగ్ గ్రాంట్ అందజేత



చెక్ అందజేస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీలో పనిచేస్తూ విధి నిర్వహణలో మణుగూరుకు డిప్యూటేషన్‌పై వెళ్లి, గత డిసెంబర్‌లో ఓసీలో జరిగిన ప్రమాదంలో ఈపీ ఆపరేటర్ మూల్చంద్ మృతి చెందారు. ఈ మేరకు మంగళవారం మృతుడి కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంట్ రూ.10.46 లక్షల చెక్‌ను ఏరియా జీఎం శాలేంరాజు అందజేశారు. మాట్లాడుతూ.. సంస్థలో పనిచేసే ఉద్యోగుల నెలసరి జీతం నుంచి రూ.20 చొప్పున రికవరీ చేసిన సొమ్మును అందజేయటం జరిగిందన్నారు. తోటి కార్మిక కుటుంబానికి కార్మికులు సహాయం చేయటం అభినందనీయమన్నారు. అదే విధంగా కంపెనీ షేర్ రూ.10 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్‌ను కూడా అందజేసినట్లు తెలిపారు. మూల్చంద్ విధి నిర్వహణలో మృతి చెందటం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు.

ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు వి.మల్లికార్జున్‌రావు, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ ఏ.ఉపేందర్‌బాబు, ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, డీజీఎం పర్సనల్ బి.శివకేశవరావు, జీకేఓసీ పీఓ ఎం.శ్రీరమేష్, ఓసీ యాక్టింగ్ మనేజర్ వీవీ మధుకర్, ఎస్టేట్స్ ఆఫీసర్ తావుర్యా, ఓసీ సంక్షేమాధికారి ఎండీ ఖలీల్‌అహ్మద్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి..

కంపెనీ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో పనిచేసి అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలు 19 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎండీ రజాక్, వి.మల్లికార్జున్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరచారి

టేకులపల్లి: వ్యాయామ ఉపాధ్యాయులు కొత్తకొత్త పద్ధతులు నేర్చుకుని, శిక్షణలో నైపుణ్యం పెంచుకుని రాబోయే రోజుల్లో పాఠశాలల నుంచి విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. ప్రభుత్వం ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా రాష్ట్ర వ్యాపితంగా ఉపాధ్యాయులకు సబ్జెకుల వారీగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 102 మంది వ్యాయామ ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని డీఈఓ ప్రారంభించారు. మాట్లాడుతూ..

ఐదు రోజుల శిక్షణలో అనేక కొత్త విషయాలు నేర్చుకోవాలని తద్వారా విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. అనంతరం సులానగర్ ఉన్నత పాఠశాలలో టేకులపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జ్ మెరుగు శ్రీనివాస్, జిల్లా ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సాయికృష్ణ, డీఆర్‌పీలు నరేష్‌కుమార్, కవిత, రామనాథం, శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సంధ్య పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పాల్వంచరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు హాజరు కావాలని కోరారు.

జూన్ 3న జేబీసీసీఐ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): జూన్ 3న జాయింట్ బైపార్టీయేట్ కోల్ కమిటీ ఆఫ్ ఇండియా (జేబీసీసీఐ) స్టాండరైజేషన్ కమిటీ సమావేశం జరగనుందని కోలిండియా యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 11వ వేతన కమిటీ సమావేశంలో కుదిరిన కొన్ని ఒప్పందాలు కొన్ని పరిశ్రమల్లో అమలవుతుండగా, మరికొన్ని పరిశ్రమల్లో అమలు కావటం లేదు. ఈ అంశాలతోపాటు, కార్మికుల వేతనాలు, ఇతర సౌకర్యాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో కోలిండియా యాజమాన్యంతోపాటు సింగరేణి అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొంటారని, సమావేశం స్థలాన్ని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

స్థలం వితరణ

పాల్వంచరూరల్: చంద్రాలగూడెం గ్రామపంచాయతీలోని తుమ్మలగూడెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఆదే గ్రామానికి చెందిన సోదరులు కుంజ చెంచయ్య, చిన్నరామయ్య ఆరుకుంటల భూమిని మంగళవారం వితరణ చేశారు. ఈ మేరకు గ్రామపెద్దలకు భూమి పత్రాలను అందజేశారు.

విద్యార్థుల నమోదు పెంచాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎంఈఓ ఉమాశంకర్



జూలూరుపాడు: మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

ఇల్లెందు: పట్టణంలోని మొయిన్‌రోడ్ హైస్కూల్‌లో గుండాల, ఆళ్లపల్లి మండలాల టీచర్లకు శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఎంఈఓ కుర్సం పార్వతి ఈ శిక్షణను ప్రారంభించారు. బోధనలో మార్పులను వివరించారు. ఉపాధ్యాయులు తరగతి గదికి నిత్య నూతనంగా వెళ్లాలని, విద్యార్థుల నమోదుతో పాటు గుణాత్మక విద్యలో సమూల మార్పులు తీసుకురావాలని కోరారు. ఆళ్లపల్లి ఎంఈఓ శాంతారావు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: చదువు పట్ల విద్యార్థికి ఆసక్తి పెరిగేలా బోధన ఉండాలని ఎంఈఓ ఉమాశంకర్ సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీరోజు తరగతి గదిలో నూతనత్వాన్ని సృష్టిస్తూ విద్యార్థి రోజూ బడికి వచ్చేలా దృష్టి సారించాలని చెప్పారు. విద్యార్థికి అర్థమయ్యేలా మెళకువలు పాటించాలని సూచించారు. ఆటపాటలతో, ప్రయోగాత్మక బోధనా పద్ధతులు పాటించాలని, తద్వారా విద్యార్థిలో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఆర్పీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని జూలూరుపాడు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. స్థానిక కేజీబీవీలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల నిర్వహించే శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన విధంగా విద్యార్థులకు మెరుగైన, ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. 100 శాతం విద్యార్థుల నమోదు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించాలని చెప్పారు. అదే విధంగా బడిబాట కొనసాగించాలన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన



సింగరేణి(కొత్తగూడెం): జీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలు నిరసించాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహ వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నేతలు కె.సారంగపాణి, ఎస్ఏ నబీ, మల్లెల వెంకటేశ్వర్లు, నరాటి వెంకటేశ్వర్లు, ఎండీ రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, కొప్పుల శ్రీనివాసరావు, సామేల్, రామిశెట్టి నరసింహరావు, చారీ, వీరన్న, సీతారాములు, గురునాథం ఉన్నారు.

టేకులపల్లి: సింగరేణి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం కోయగూడెం ఓసీలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రొటెస్ట్ డే, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు అజ్మీరా కిషోర్, ఐఎన్‌టీయూసీ నేత భుక్యా నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నేత భయ్యా వరప్రసాద్ మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఆరోపించారు. సింగరేణిలో కొత్త గనులు వస్తేనే మనుగడ సాగుతుందని, ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికుల శ్రమను బడా పారిశ్రామిక సంస్థలకు దోచిపెడుతోందని విమర్శించారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు భూక్యా బాలుకుమార్, సామల శ్రీనివాస్, కొసూరి సత్యనారాయణ, జీఏ శ్రీనివాస్, గుగులోత్ బాసు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశ వ్యాప్తంగా మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు ఉద్యమాన్ని సాగిస్తామని, జూలై 9 జరపతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పాల్వంచ: కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల పొట్టకొడుతోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ అన్నారు. మంగళవారం జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ, ఏఐటీయూసీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విమానాశ్రయాలు, సముద్రపోర్ట్‌లు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని విమర్శించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోపిడీ చేస్తోందన్నారు. రాజ్యాంగంలో కల్పించిన స్వేచ్ఛా స్వాతంత్రాలను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 9న జరగనున్న సమ్మెను కార్మికవర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కె.సత్య, బండి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, బుస్సా మొగిలి, రోజా, సురేందర్ పాల్గొన్నారు.

కలగానే కొత్త రేషన్ కార్డులు

- ప్రజాపాలన దరఖాస్తులకు కలగని మోక్షం
- అర్హులుగా ప్రకటించినా అందని రేషన్ కార్డులు
- మళ్లీ ఆన్‌లైన్ కోసం మీసేవకు పరుగులు



ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం

ఇల్లెందురూరల్: ప్రజాపాలన పేరుతో నిర్వహించిన గ్రామసభల్లో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. చాలాకాలం తరువాత వచ్చిన అవకాశంగా భావించిన ప్రజలు అధిక సంఖ్యలో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత సర్వే నిర్వహించిన అధికారులు అర్హుల జాబితా ప్రకటించారు. కానీ నేటికీ మంజూరు కాలేదు.

మండలంలో 4,940 దరఖాస్తులు..

అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరిలో ప్రజాపాలన పేరుతో గ్రామసభలు నిర్వహించింది. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు... ఇతరత్రా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో ప్రజలు భారీగా వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా వచ్చిన వాటిలో కేవలం రేషన్‌కార్డు కోసం 4,940 దరఖాస్తులు వచ్చాయి.

ఇంటింటికి వెళ్లి విచారణ..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి విచారణ చేపట్టారు. లబ్ధిదారులను గుర్తించారు. మండలంలో రేషన్ కార్డుల కోసం వచ్చిన 4,940 దరఖాస్తులలో 3,633 అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు 2024 జనవరి 21, 22, 23 తేదీలలో గ్రామసభలలో అర్హుల జాబితాను అధికారులు చదివి వినిపించారు.

గతంలోని ఆన్‌లైన్ జాబితా ఏమైందో..

ప్రజాపాలనతో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇలా ప్రతీ విభాగానికి అర్హుల జాబితాను పంపి ఆన్‌లైన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు ప్రకటించారు. కానీ రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేశారో.. లేదోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ చేసుకున్న వారికే..

అర్హులైన వారందరికీ సన్నబియ్యం పంపిణీ ప్రారంభ సమయంలోనే నూతన రేషన్‌కార్డు దారులకు కూడా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు ఇవ్వకుండా నేరుగా మీ సేవ, రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు అందించిన వారికి మాత్రమే కొత్తగా రేషన్ కార్డులు రావడం, వారంతా గత నెలలోనే బియ్యం కూడా తీసుకోవడంతో మిగతా అర్హులైన వారిలో ఆందోళన నెలకొంది. వెంటనే తాజా మాజీ ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులను గ్రామాలలో ప్రజలు ప్రశ్నించడం ప్రారంభించారు. దీంతో వెంటనే మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో మరోసారి మళ్లీ మీసేవ వద్దకు పరుగులు తీస్తున్నారు.

తాజాగా మరోసారి విచారణ...

మీసేవ నుంచి రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులతో రెవెన్యూ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి విచారణ చేస్తున్నారు. తాజా విచారణతోనైనా తమకు రేషన్ కార్డులు మంజూరు చేస్తారా.. కాలయాపన చేస్తారా అని ఆందోళన చెందుతున్నారు.

రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నా..



రేషన్‌కార్డు కోసం ప్రజాపాలనలో. దరఖాస్తు చేసుకున్నాం. విచారణకు అధికారులెవరూ రాలేదు. పంచాయతీ కార్యదర్శిని కలిశాం. ఆయన సూచనతో మరోసారి దరఖాస్తు చేసుకున్నాం. కానీ నేటికీ ఎవరూ విచారణకు రాలేదు. మా దరఖాస్తు ఏమైందో ఎవరూ చెప్పడం లేదు.

– దైద శ్రీలత, రాఘబోయినగూడెం

అర్హులందరికీ మంజూరు చేస్తాం..



ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం. అర్హుల జాబితాలో పేరు ఉన్నవారు మరోసారి మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఎవరికీ చెప్పలేదు. మా వద్ద ఉన్న. దరఖాస్తులతో ఇంటింటికీ వెళ్లి విచారణ చేస్తున్నాం.

– కోట రవికుమార్, తహసీల్దార్, ఇల్లెందు